'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలు



కంకిపాడు మండలంలో పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు



నున్న జెడ్పీ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రం

కంకిపాడు: పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధ మైంది. సోమవారం నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనెల 31వ తేదీతో పరీక్షలు ముగియనున్నాయి. ఇందుకు గాను పరీక్ష కేంద్రాలు, ఆయా కేంద్రాల్లో వసతులను మండల విద్యాశాఖ పర్యవేక్షించింది. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసింది.

ఎనిమిది పరీక్షా కేంద్రాల ఏర్పాటు..

మండలంలో ఎనిమిది పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 463 మంది, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 1,385 మంది, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు 95 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్స్, విభాగ అధికారులు, ఇన్విజిలేటర్లు తగు సూచనల నడుమ పరీక్షలు నిర్వహించేలా ఏర్పాట్లు జరిగాయి.

144వ సెక్షన్ అమలు..

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎంఈవో- 2 కె.ప్రసాద్ తెలిపారు. పోలీసు బందోబస్తు నిర్వహిస్తారన్నారు. పరీక్ష కేంద్రాల్లో నో సెల్‌ఫోన్ జోన్ ఆదేశాలు ఉన్నాయని, ఏ ఒక్కరూ సెల్ ఫోన్‌లు తీసుకురాకూడదని స్పష్టంచేశారు.

ఉంగుటూరు మండలంలో..

ఉంగుటూరు: 'పది' పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. సోమవారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. అరగంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మండలంలో తేలప్రోలు, మానికొండ, ఉంగుటూరు, ఇందుపల్లి, ఆత్కూరు, పెద్ద అవుటపల్లి, ఆత్కూరు గుడ్రన్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని ఎంఈవో జె.సాంబశివరావు తెలిపారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 752 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకానున్నారు.

విజయవాడ రూరల్‌లో 14 సెంటర్లు

విజయవాడరూరల్: మండలంలో 14 సెంటర్లలో పదవ తరగతి పరీక్షలు జరుగుతాయని ఎంఈవో ఏ.సూరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నున్న జెడ్పీ హైస్కూల్, కెనడీ హైస్కూల్, శ్రీ చైతన్య హైస్కూల్, గొల్లపూడిలో జిల్లా పరిషత్ హైస్కూల్, ఎస్వీఎస్ఆర్‌సీ హైస్కూల్, రవీంద్ర భారతి, నారాయణ హైస్కూల్స్, జక్కంపూడి కాలనీలో జిల్లా పరిషత్ హైస్కూల్, కొత్తూరు తాడేపల్లిలో సెయింట్ బెనెడిక్ట్స్ హైస్కూల్, నిడమానూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు సెంటర్లు, రామవరప్పాడు జిల్లా పరిషత్ హైస్కూల్, వివేకానంద హైస్కూల్, రవీంద్రభారతి హైస్కూల్స్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. 2,477 మంది విద్యార్థులు కామన్ పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సదుపాయం, హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం ఉందన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమలులో ఉంటుందని, 119 మంది ఇన్విజిలేటర్లు, 14 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 14 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు విధులు నిర్వహిస్తున్నారని ఎంఈఓ తెలియచేశారు.

క్లుప్తంగా

మొక్కల సంరక్షణతో కాలుష్య నివారణ



కంకిపాడు: మొక్కల సంరక్షణతోనే కాలుష్య నివారణ సాధ్యమని కంకిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ చైర్మన్ బోయిన రోహిణీకుమారి అన్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఆదివారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. రోహిణీకుమారి మాట్లాడుతూ రోజు రోజుకీ కాలుష్యం పెరిగిపోవటంతో భవిష్యత్తు తరాల జీవనం అనారోగ్య వాతావరణంలో సాగుతుందన్నారు. కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. సామాజిక బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంజయ్, కమిటీ ప్రతినిధులు చలువాది రాజా గురవయ్య, జి.రవికిషోర్, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాత అశోక్‌కు సన్మానం



పెనమలూరు: సమాజంలో అనేక సందర్భాలలో 66 సార్లు రక్తదానం చేసిన మాతృహృదయ్ స్వచ్ఛంద్ సేవాసంఘ్, అశోక్ జిమ్ నిర్వాహకుడు తాళ్లూరి అశోక్‌ను ఘనంగా సన్మానించారు. గుంటూరు జిల్లా పొన్నూరు బ్లడ్ బ్యాంక్ వెల్ఫేర్ అసోసియేషన్ 9వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో తాళ్లూరి అశోక్‌ను సన్మానించి అభినందించారు. తాళ్లూరి అశోక్ ఇప్పటికి 66 సార్లు రక్తదానం చేశారు. బాడీ బిల్డింగ్ వ్యాయామ క్రీడా రంగంలో అనేక మంది క్రీడాకారులను తీర్చిదిద్దారు. ఉమ్మడి కృష్ణా జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శిగా పని చేస్తున్నారు. మాతృహృదయ్ స్వచ్ఛంద్ సేవాసంఘ్ సంస్థ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అశోక్‌ను ఘనంగా సన్మానించారు.

శివాలయానికి రూ.5 లక్షల వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడులో నూతనంగా నిర్మించిన శ్రీ భ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానానికి దాత మునునూరి శ్రీనివాసరావు, పద్మజ దంపతులు రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. బొమ్ములూరుకు చెందిన శ్రీనివాసరావు ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం ఆయన నివాసంలో అందించారు. దాత శ్రీనివాసరావుకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మునునూరు కాశీవిశ్వేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, ఆలయ కమిటీ సభ్యులు గూడవల్లి చిన్నా, వీరమాచినేని నాగయ్య పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

హనుమాన్‌జంక్షన్ రూరల్: వేసవిలో పాదచారులు, ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు ఏర్పాటు చేయటం అభినందనీయని హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ వి.సతీష్ అన్నారు. స్థానిక విజయవాడరోడ్డులో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. సేవా సమితి కన్వీనర్ బెక్కం వెంకటేశ్వరరావు, నండూరు సాయి వేణుగోపాలరావు, వడ్డి రాజేశ్వరరావు, తోట సుజాత, సత్యవాణి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం



పెనమలూరు పీఎస్‌లో నివాళులర్పిస్తున్న పోలీసులు



ఉయ్యూరులో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీడీవో శేషగిరిరావు



హనుమాన్‌జంక్షన్ రూరల్‌లో శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పెనమలూరు: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో పొట్టిశ్రీరాములు జయంతిని ఆదివారం నిర్వహించారు. పలు చోట్ల ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణకు ఆమరణ నిరాహార దీక్ష చేసి అశువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములును స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పలువురు వక్తలు కొనియాడారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నేటి యువత పొట్టి శ్రీరాములు ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

త్యాగజీవి పొట్టి శ్రీరాములు

ఉయ్యూరు రూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితం ఆంధ్ర రాష్ట్రం అని ఉయ్యూరు ఎంపీడీవో శేషగిరిరావు కొనియాడారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటులో శ్రీరాములు త్యాగం మరువలేనిదన్నారు. ఆయన త్యాగంతోనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ఏలూరు రోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. కల్యాణ మండపం ప్రాంగణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆంధ్రులు అత్మగౌరవానికి ప్రతీక పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు కొనకళ్ల రాజశేఖర్, నాయకులు గార్లపాటి రామకృష్ణ, చామర్తి రాంబాబు, నారికపల్లి ప్రసాద్, వెంకటేశ్వరరావు, కొనకళ్ల ధనలక్ష్మీ, మహిళా విభాగం జిల్లా కోశాధికారి మిట్టపల్లి పద్మ పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

- మండల సమావేశంలో ఏఈ వెల్లడి
- సాదాసీదాగా మండల సమావేశం
- నిధుల కేటాయింపులో వివక్ష తగదన్న జెడ్పీటీసీ



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ ఏఈ

గన్నవరం: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆదివారం సర్వసభ్య సమావేశం సాదాసీదాగా ముగిసింది. తొలుత వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ అధ్యక్షతన సమావేశం ప్రారంభమైంది. సెలవు రోజు కావడంతో కీలక శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సమావేశానికి డుమ్మా కొట్టారు. హాజరైన కొద్ది మంది అధికారులతోనే సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరాలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించేందుకు కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పా టు చేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు తెలిపారు. మండలంలో 21 గ్రామ పంచాయతీలకు గాను 17 గ్రామ పంచాయతీలకు మాత్రమే అభివృద్ధి పనుల నిమిత్తం మండల పరిషత్ నిధులు కేటాయించారని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి తెలిపారు. మిగిలిన గ్రామ పంచాయతీల విషయంలో వివక్షత తగదని, వాటికి కూడా అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరారు. ఎంపీటీసీ సభ్యులందరి కోరిక మేరకే నిధులు కేటాయింపు చేస్తున్నట్లు వైస్ ఎంపీపీ సుధీర్ చెప్పారు. వైస్ ఎంపీపీ- 2 సాతులూరి శివనాగ రాజకుమారి, ఎంపీడీఓ టి.స్వర్ణలత పాల్గొన్నారు.

రేపు వ్యవసాయ మోటార్లకు విద్యుత్ కట్

ఉయ్యూరు రూరల్: మండలంలోని ముదునూరు 33/11 విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఉయ్యూరు రూరల్ ఏఈఈ డి.కష్ణనాయక్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. 33 కేవీ ఫీడరు మరమ్మతులు చేపడుతున్న కారణంగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ముదునూరు, బోళ్లపాడు, సాయిపురం జబర్లపూడి గ్రామాల పరిధిలో ఉన్న వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేస్తున్నట్టు పేర్కొన్నారు. అప్పుడప్పుడు గృహాల విద్యుత్‌కు కూడా అంతరాయం ఏర్పడే అవకాశం ఉందన్నారు. వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

19న హుండీ కానుకల లెక్కింపు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో హుండీ కానుకలను ఈనెల 19న లెక్కిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక ఆదివారం తెలిపారు. అమ్మవార్లకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల ఆదాయాన్ని దేవదాయశాఖాధికారి పర్యవేక్షణలో లెక్కించనున్నట్లు వివరించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆసక్తి గల వారు పాల్గొనవలసిందిగా కోరారు.

షాపు నంబరు- 2కు బహిరంగ వేలం

వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయానికి సంబంధించిన షాపు నంబరు- 2ను ఈనెల 19న 3 సంవత్సరాలకు లీజుకు ఇచ్చేందుకై సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖాధికారి ఆధ్వర్యంలో సీల్డ్ టెండర్, బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని తెలిపారు.

తాగునీరు, డ్రెయినేజీ సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నేతలు



తాడిగడపలో పర్యటిస్తున్న సీపీఎం నేతలు

గన్నవరం: స్థానిక ఎస్సీ కాలనీలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. సీపీఎం నేతలు కాలనీలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో మంచినీళ్లు సక్రమంగా రావడం లేదని, రెండు రోజులకు ఓసారి నీళ్లు వస్తున్న పరిస్థితి నెలకొందని పలువురు మహిళలు తెలిపారు. సరైన డ్రెయినేజీ సదుపాయం లేకపోవడంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో దోమల బెడద ఎక్కువగా ఉందని ఎంపీటీసీ సభ్యులు తిరివీధి రవి తెలిపారు. గ్రామాభివృద్ధికి వినియోగించాల్సిన పంచాయతీ నిధులను అందరూ కుమ్మక్కై స్వాహా చేస్తున్నారని, ఉన్నతాధికారులు సైతం పట్టించుకోవడం లేదని వాపోయారు. కాలనీలో నెలకొన్న తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను అధికారులు తక్షణం పరిష్కరించాలని సీపీఎం మండల అధ్యక్షుడు ఎం. ఆంజనేయులు డిమాండ్ చేశారు. పార్టీ నేతలు సూరగాని సాంబశివరావు, జాస్తి శ్రీనివాసరావు, చిటికెల రాజేశ్వరరావు, ఉడతా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

పెనమలూరు: ప్రజాసమస్యల పరిష్కారించే విషయంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని మండల సీపీఎం కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి అన్నారు. తాడిగడప కార్మికనగర్- 2లో ఆదివారం ఇంటింటికీ సీపీఎం నేతలు పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా త్రిమూర్తి మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీలో ప్రజల వద్ద నుంచి పన్నులు వసూళ్లు చేయటానికి అధికారులు చూపుతున్న ఉత్సాహం సమస్యల పరిష్కారంపై లేదని ఆరోపించారు. కార్మికనగర్‌లో మురుగునీటి పారుదల జరగక స్థానికులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారుల దృష్టికి సమస్య తీసుకువెళ్లినా స్పందించటం లేదని విమర్శించారు. నేతలు పుసులూరి పాతాళలక్ష్మి, పి.లక్ష్మినారాయణ, సీహెచ్.రాంబాబు, డి.సింహాచలం, సీహెచ్. దుర్గాప్రసాద్, భవాని, పలువురు నేతలు స్థానిక సమస్యలు గుర్తించారు.

చక్రవర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు



దేవభక్తుని చక్రవర్తిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న పార్టీ నేతలు

కంకిపాడు: వైఎస్సార్ సీపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి పిలుపునిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా, నియోజకవర్గ, మండల కమిటీల్లో పదవులు పొందిన పార్టీ నేతలు ఆదివారం కానూరులోని పార్టీ కార్యాలయంలో దేవభక్తుని చక్రవర్తిని మర్యాదపూర్వకంగా కలుసుకుని సత్కరించారు. కృతజ్ఞతలు తెలియజేశారు. సత్కరించిన వారిలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శీలం శ్రీరాములు, కంకిపాడు మండల అధ్యక్షురాలు మాదు శ్రీహరిరాణి, జిల్లా అధికార ప్రతినిధి సత్తా వెంకటేశ్వరరావు, నియోజకవర్గ అనుబంధ విభాగాలైన మేధావుల విభాగం అధ్యక్షుడు పిడికిటి రామకోటేశ్వరరావు, చేనేత విభాగం అధ్యక్షుడు గణపవరపు కాళిదాసు, మహిళా విభాగం అధ్యక్షురాలు నందిపాటి బిందుమాధవి, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలు కర్రా జోజ్ మేరీ ఉన్నారు. నూతనంగా నియమితులైన నేతలకు చక్రవర్తి అభినందనలు తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, పార్టీ జిల్లా నేతలు బందెల సుబ్బారావు, భీమవరపు నాగిరెడ్డి, మాదు రాఘవేంద్రరావు, చుండూరు మోహన్‌రావు, కరీముల్లా, చోరగుడి శ్రీకాంత్, అయ్యన్నబాబు, కోలవెన్ను ఎంపీటీసీ తోకల ఉమాదేవి పాల్గొన్నారు.

క్రీస్తు చూపిన మార్గంలో నడుచుకోవాలి



గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు వెంకటనరసింహాపురం కాలనీలో ఆర్‌సీఎం గన్నవరం విచారణ ఆధ్వర్యంలో ఆదివారం తపస్సు కాలంలో భాగంగా శిలువ మార్గం ప్రదర్శన నిర్వహించారు. విచారణ గురువులు పసల థామస్ నేతృత్వంలో శిలువను చేతపట్టుకుని క్రీస్తును స్మరించుకుంటూ స్తుతి గీతాలను ఆలపిస్తూ భక్తులు ర్యాలీలో పాల్గొన్నారు. సోమవారం నుంచి పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల కోసం ఫాదర్ థామస్ ప్రత్యేక ప్రార్థన జరిపారు. అనంతరం జరిగిన దివ్యబలిపూజలో ఆయన భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు బోధనలకు అనుగుణంగా ప్రేమ, దయ, కరుణ కలిగి ఉండి, తోటివారికి సాయపడాలని భక్తులకు సూచించారు. పలువురు సంఘ పెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

23న నడక పోటీలు

గన్నవరం: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ఈ నెల 23వ తేదీ ఉదయం 6 గంటలకు నడక పోటీలను నిర్వహించనున్నట్లు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్. కిషోర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. నడక పోటీలను 40 ఏళ్లలోపు, 40 నుంచి 49 ఏళ్లు, 50 నుంచి 59 ఏళ్లు, 60 నుంచి 70 ఏళ్లలోపు విభాగాల్లో పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 70 ఏళ్లు పైబడిన పురుషులు, మహిళలకు వేర్వేరు విభాగాల్లో నడక పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో విజేతలకు ఉగాది పండుగ సందర్భంగా ఈ నెల 30వ తేదీ ఉదయం 10 గంటలకు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. నడక పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు ఈ నెల 22వ తేదీలోపు వాకర్స్ అసోసియేషన్ వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.